
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 18 నవంబరు 2024





మల్లవల్లి గ్రామానికి కేటాయించిన భూమిలో చదును చేస్తున్న జేసీబీ

మల్లవల్లి ఏపీఐఐసీ భూముల్లో
మళ్లీ లొల్లి

గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమిని పారిశ్రామిక వాడలో కలుపుకోవడానికి ఏపీఐఐసీ యత్నం

- అభ్యంతరం తెలిపిన గ్రామస్తులు
- ముందుకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరిక

హనుమాన్‌జంక్షన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి గ్రామ అవసరాలకు కేటాయించిన వంద ఎకరాల భూమని తమ ఆధీనంలోకి తీసుకోవడానికి ఏపీఐఐసీ అధికారులు ఆదివారం చేపట్టిన చర్యలను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామానికి కాకుండా ఆ భూమిని పారిశ్రామిక వాడలో కలపాలని చూస్తే సహించేది లేదని, ఖచ్చితంగా అడ్డుకుంటామని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అధికారులను హెచ్చరించారు. మల్లవల్లి ఆర్ ఎస్ నెం:11లో 1,460 ఎకరాల భూమిని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పారిశ్రామిక వాడ అభివృద్ధికి ఏపీఐఐసీ కి అప్పగించింది. 1,460 ఎకరాల భూమిలో గ్రామ కమ్యూనిటీ అవసరాలకు 100 ఎకరాలు కేటాయించింది. మిగిలిన 1,360 భూమిలో ఏపీఐఐసీ లేఅవుట్ చేసి పరిశ్రమలకు కేటాయింపులు చేసింది. అయితే గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమిలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జెడ్పీ హైస్కూల్‌కు ఐదు ఎకరాలు కేటాయించగా అందులో హైస్కూల్ నిర్మాణం చేపట్టారు. అందులోనే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి కొంత భూమి, పేదల ఇళ్ల స్థలాలకు మరో 35 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదించారు. పెరికీడు, కె.సీతారాంపురం, బొమ్ములూరు తదితర గ్రామాల పేదలకు కూడా మల్లవల్లిలోని ఆ వంద ఎకరాల భూమిలో స్థలాలు కేటాయించాలని రెవెన్యూ అధికారులు అనుకున్నారు. గుట్టలు, లోయలుగా ఉన్న ఆ భూమిని చదును చేసి రాళ్లు కూడా పాతారు. ఏ ఊరి పేదలకు ఆ ఊర్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ ముందుకు రావడంతో ఇళ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయింది. ఇంత వరకు మల్లవల్లి గ్రామంలో పేదలకు స్థలాలు పంపిణీ జరగలేదు.

పారిశ్రామికవాడలో కలుపుకొనేందుకు..



ఆదివారం ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జీ గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమిని లెవలింగ్ చేసి పారిశ్రామిక వాడలో కలుపుకునేందుకు చర్యలు చేపట్టారు. హైస్కూల్ భవనం నిర్మించిన ఏరియాతో పాటు మరి కొంత భూమి దాదాపు 18 ఎకరాలను వదిలిపెట్టి మిగిలిన 82 ఎకరాల భూమిని లెవలింగ్ చేయడానికి జేసీబీలతో పనులు చేపట్టారు. గ్రామానికి కేటాయించిన వంద ఎకరాలు చుట్టూ ఉన్న ఇనుప ముళ్ల కంచెను కూడా తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నాయకులు అక్కినేని కృష్ణారావు, అలూరి సురేష్, వేముల కాసులు, వేముల నాగరాజు, నరదల పుల్లయ్య, చిన్నాల మంగయ్య తదితరులు వెళ్లి అడ్డుకున్నారు. 2016 అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం వందెకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, దానిని తిరిగి ఇప్పుడు పారిశ్రామిక వాడలో కలుపుకోవడానికి పూనుకోవడం అన్యాయమని అభ్యంతరం వ్యక్తం చేశారు. జెడ్ఎంకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు కాపీని అందజేసి వివరించారు. గ్రామ అవసరాలకు కేటాయించిన భూమి జోలికి రావద్దని విజ్ఞప్తి చేశారు. కాదని ముందుకు వెళితే ఎమ్మెల్యే యార్లగడ్డ సహకారంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఖచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో అక్కడ చేపట్టిన పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

ఏపీఐఐసీకి అప్పగించింది 1200 ఎకరాలే!

రెవెన్యూ రికార్డులు ప్రకారం ఏపీఐఐసీకి అప్పగించింది 1,360 ఎకరాలు, కాని భూమిగా 1200 ఎకరాలు కూడా లేదని తెలుస్తోంది. అందుకే ఏపీఐఐసీ అధికారులు ప్రభుత్వ ఉన్నతాధికారుల సహకారంతో గ్రామానికి కేటాయించిన వందెకరాల భూమిని కూడా పారిశ్రామిక వాడలో కలుపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సర్వే చేసి పారిశ్రామిక వాడ బౌండరీ ఫిక్స్ చేశారు. రికార్డులు ప్రకారం 1,360 ఎకరాల లేకపోవడంతో గ్రామానికి కేటాయించిన వంద ఎకరాల భూమిని కూడా పారిశ్రామిక వాడలో కలుపుకునే ప్రయత్నంలో భాగమే ఆదివారం చేపట్టిన పనులేనని పలువురు భావిస్తున్నారు.

ప్రవచన కార్యక్రమానికి హాజరైన భక్తులు. ఇన్‌సెట్‌లో గరికపాటి





మంత్రశక్తి వైజ్ఞానికం

పద్మశ్రీ గరికపాటి నరసింహారావు

6లో

భక్తజన సంద్రం



మంగినపూడి బీచ్‌లో స్నానాలు చేస్తున్న భక్తులు



నున్న మామిడి తోటలో మ్యూజికల్ చైర్



భవానీ ద్వీపంలో వనభోజనాలు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మచిలీపట్నం మంగినపూడి బీచ్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. భారీగా తరలివచ్చిన యాత్రికులు ఉదయం నుంచి సాయంత్రం సముద్రంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారు రోజంతా ఉల్లాసంగా గడిపారు. నున్న శివారులోని మామిడి తోటల్లో వనసమారాధనలు విరివిగా జరిగాయి. పచ్చని చెట్ల మధ్య ఆటపాటలతో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు.

చెక్ రిపోర్టుల సొమ్ము స్వాహా!

సరిహద్దు ప్రాంతాల్లో ట్రాన్స్‌పోర్టు వాహనాల తనిఖీ సమయంలో రవాణాశాఖ అధికారులు డ్రైవర్ల బలహీనతలను ఆసరాగా చేసుకుని తీవ్రస్థాయిలో అవినీతికి పాల్పడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నిబంధనల పేరుతో జరిమానాలు రాస్తున్న అధికారులు ఆ డబ్బులను డ్రైవర్ల వద్ద నుంచి తీసుకుని కార్యాలయంలో జమ చేయకుండా దారిమళ్లిస్తున్నట్లు సమాచారం. దీంతో వాహనదారులు నగదు చెల్లించినా కూడా వారి వాహనాలపై చెక్ రిపోర్టుల్లో పెండింగ్ కేసులు చూపుతూనే ఉన్నాయి. ఇలాంటి కేసులు భారీగా పేరుకుపోవడంపై రవాణాశాఖ ఉన్నతాధికారులు ఆరా తీస్తే చెక్ రిపోర్టుల సొమ్ము స్వాహా విషయం బయటకు వచ్చినట్లు సమాచారం.



రవాణాశాఖ అధికారుల మాయాజాలం

- సరిహద్దుల్లో తనిఖీలు.. వాహనదారులకు జరిమానాలు
- కాంపౌండింగ్ ఫీజు కార్యాలయంలో కట్టమని చెల్లిస్తున్న డ్రైవర్లు
- కట్టకుండానే జేబులో వేసుకుంటున్న అధికారులు
- చెక్ రిపోర్టులో పెండింగ్ కేసులపై ఆరా తీస్తున్న ఉన్నతాధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రవాణా వాహనాలైన లారీలు, ట్రాలీలు, కంటైనర్లు, ట్యాంకర్లను సరిహద్దు ప్రాంతంలో రవాణాశాఖ అధికారులు ఆపి వాటిని పరిశీలిస్తారు. నిబంధనల ప్రకారం డాక్యుమెంట్స్ ఉన్నాయా.. ఓవర్ లోడ్ వేస్తున్నారా.. వాహనంలో ఏమైనా లోపాలు ఉన్నాయా.. వంటివి పరిశీలిస్తారు. ఏవైనా గుర్తిస్తే కాంపౌండింగ్ ఫీజుల పేరిట జరిమానాలు విధిస్తారు. ఇలా జరిమానాలు విధించిన విషయాన్ని ఆన్‌లైన్‌లో ప్రస్తావిస్తూ చెక్ రిపోర్టు రాయాల్సి ఉంటుంది. పలాన నంబర్ కలిగిన వాహనంలో గుర్తించిన లోపాలను ప్రస్తావిస్తూ దీనికి ఎంత జరిమానా విధించారో పొందుపరచాల్సి ఉంటుంది. ఈ జరిమానాలను వాహనదారులు రవాణా శాఖ కార్యాలయాల్లో చెల్లించాల్సి ఉంటుంది. జరిమానా చెల్లిస్తేనే చెక్ రిపోర్టులో పెండింగ్ లేదని వస్తుంది. జరిమానా చెల్లించకపోతే చెక్ రిపోర్టులో పెండింగ్ అని చూపిస్తుంది. జరిమానా చెల్లించని వాహనాన్ని మళ్లీ ఏదైనా సందర్భంలో వాహన తనిఖీ అధికారులు తనిఖీలు చేసేటపుడు పాత కేసులు కూడా చెక్ చేస్తారు. అప్పుడు చెక్ రిపోర్టులో పెండింగ్ అని చూపిస్తోంది. అంటే ఆ వాహనదారుడు డబ్బులు కట్టలేదని అర్థం. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఇక్కడ వాహనదారులు డబ్బులు కట్టేసినా అవి మాత్రం రవాణా శాఖకు జమ కావటం లేదు.

రవాణా శాఖ అధికారులు దాదాపుగా రాత్రి సమయంలోనే తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలను తనిఖీ చేసి జరిమానా విధించినపుడు ఆఫీసు ఉండదు కనుక ఆ సమయంలో వారు డబ్బులను రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి కట్టలేరు. మరుసటి రోజు పదిన్నర గంటల వరకు లారీ ఇక్కడే పెట్టుకుని వేచి ఉండలేరు. ఇలాంటి సందర్భంలో జరిమానా డబ్బులను మీరే కట్టమని వాహన తనిఖీ అధికారులకు ఇచ్చేస్తున్నారు. ఈ డబ్బులను తనిఖీ అధికారులు కట్టడం లేదని తెలుస్తోంది. ఇదేదో మంచి ఆదాయ వనరుగా ఉందన్న ఉద్దేశంతో పలువురు అవినీతి ఇన్‌స్పెక్టర్లు చెక్ రిపోర్టులలోకే ఎక్కించటం లేదని సమాచారం. వాహనాల లోపాలను చూపి కాంపౌండింగ్ ఫీజులు వసూలు చేస్తున్నట్టుగా వాహనదారుల ముందు బిల్డప్ ఇచ్చి వారి దగ్గర డబ్బులు తీసుకుంటున్నారని తెలిసింది. ఈ డబ్బులు వారి సొంత జేబుల్లోకి వెళ్లిపోతున్నాయి. కాంపౌండింగ్ ఫీజులకు సంబంధించి నిర్దేశిత టార్గెట్లను చేరుకునేందుకు పనిచేశామని చెప్పుకోవటానికి కొన్ని చెక్ రిపోర్టులలో పేర్కొంటున్నా.. వసూలు చేసిన డబ్బులను కట్టడం లేదు. ఇతర రాష్ట్రాల వారు కావటంతో వారిని గుర్తించటం, అడగటం కూడా కష్టం. ఆయా వాహనాల ఓనర్లను గుర్తించి నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. రవాణా శాఖ అధికారులతో సమస్య ఎందుకులే అని వారు కిమ్మనకుండా మిగిలిన సొమ్మును కట్టేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి.

రాత్రి వేళ కావడంతో డబ్బులిచ్చి వెళ్తున్న డ్రైవర్లు

ఉన్నతాధికారుల దృష్టికి విషయం

ఇప్పటి వరకు ఈ చెక్ రిపోర్టు వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు రానప్పటికీ.. ఈ స్కామ్ జరిగిందనటానికి ఇతర మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు ఆధారాలు కూడా లభించాయి. ఇటీవల కాలంలో తనిఖీల సందర్భంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొన్ని వాహనాలకు చెక్ రిపోర్టులలో జరిమానాలు కట్టలేదని తెలిపేలా పెండింగ్‌లో చూపిస్తున్నాయి. పెండింగ్ జరిమానాల గురించి ప్రశ్నిస్తే కార్యాలయం పనిచేయదు కాబట్టి.. జరిమానా డబ్బులను పలాన ఇన్‌స్పెక్టర్లకు చెల్లించామని చెబుతున్నారు. ఇటీవల కాలంలో తనిఖీలకు సంబంధించిన చాలా కేసులలో ఆయా రవాణా వాహనదారుల నుంచి ఇదే సమాధానం వస్తోంది. దీంతో కొంతమంది వాహన తనిఖీ అధికారులు ఈ విషయాన్ని రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టుగా తెలుస్తోంది. దీంతో రవాణా శాఖ ఉన్నతాధికారులు కూడా చెక్ రిపోర్టుల అంశాన్ని పరిశీలిస్తే భారీగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిసినట్లు సమాచారం. దీనిపై ఒకరిద్దరు ఇన్‌స్పెక్టర్లను అడగ్గా.. వారు జరిమానాలు కట్టకపోతే తమకు సంబంధం ఏమిటని ఎదురు ప్రశ్నించినట్టుగా తెలుస్తోంది.

డ్రైవర్ల బలహీనతను ఆసరాగా చేసుకుని..

రాత్రుళ్లు తనిఖీలు చేసేటపుడు జరిమానాకు గురైన రవాణా వాహనదారులు ఆఫీసులకు వెళ్లి కట్టలేరు. రవాణ వాహన డ్రైవర్, క్లీనర్‌కు చదువు లేకపోవటం వల్ల ఆన్‌లైన్‌లో కట్టే విధానం తెలియక పోవచ్చు. ఒక వేళ చదువుకున్నా.. దాని విధానం తెలియక గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఏ రవాణా వాహనదారుడు కూడా తన వాహనాన్ని కార్యాలయం తెరిచే వరకు అక్కడే ఉంచే సాహసం చేయడు. ఒక వేళ పగటి సమయంలోనే తనిఖీ చేశారనుకున్నా.. ఇతర రాష్ట్రాల వాహనదారులకు రవాణా కార్యాలయాలు ఎక్కడ ఉంటాయో తెలియదు. భాష తెలియకపోవటం రకరకాల సమస్యల వల్ల ఆ డబ్బులను మోటారు వాహన తనిఖీ అధికారులకే ఇచ్చేసి వెళ్లిపోతున్నారు. లారీ యజమానులు కూడా ఇలాంటి ఇబ్బందులు ఉంటాయన్న ఉద్దేశంతో తమ డ్రైవర్లు, క్లీనర్ల చేతికి కొంత డబ్బు ఇచ్చి పంపిస్తుంటారు. దీంతో వారు ఇలాంటి తనిఖీల సందర్భంలో డబ్బులు కట్టేయమని డబ్బులు ఇచ్చేసి వెళ్లిపోతుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని అనధికారికంగా కాంపౌండింగ్ ఫీజులను నొక్కేయటం, చెక్ రిపోర్టులలో చూపిన వాటికి రవాణా వాహన సిబ్బంది నుంచి పుచ్చుకున్న డబ్బులను కూడా స్వాహా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ అంతులేని అవినీతిపై రవాణా శాఖ ఉన్నతాధికారులు విచారణ జరపాల్సిన అవసరం ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి సొమ్మును వెదజల్లి నచ్చిన చోట పోస్టింగ్‌లు వేయించుకున్న కొంతమంది మోటారు వాహనాల తనిఖీ అధికారులే ఈ కుంభకోణానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి.

నిర్మాణాల్లో నిర్లక్ష్యం



పనులు నిలిచిపోయిన ఇంజనీరింగ్ కళాశాల భవనం

కృష్ణా యూనివర్సిటీలో పునాదులదశ దాటని భవన నిర్మాణాలు

- అంచనాలు రూ.43.31 కోట్ల నుంచి 51.19 కోట్లకు పెంపు
- బిల్లులు తీసుకుని పత్తాలేకుండా పోయిన కాంట్రాక్టర్లు
- 39 నెలలుగా పట్టించుకోని యూనివర్సిటీ అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో వసతి గృహాలు, ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాల భవనాలు, క్యాంపస్ చుట్టూ ప్రహరీ, ప్రధాన ప్రవేశ ద్వారం, నూజివీడు పీజీ సెంటరులో అకడమిక్ బ్లాక్ జీ+2, బాలికల వసతి గృహంతో కలిపి నిర్మాణ పనులను రూ.43.31 కోట్ల అంచనాలతో 2021 ఆగస్టులో కాంట్రాక్టర్లకు అప్పగించారు. 18 నెలల వ్యవధిలో పనులు పూర్తి చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. 39 నెలలు గడిచినా ఆలస్యం కావడంతో ఏడాదిన్నర కిందట ఈ అంచనాలను రూ.51.19 కోట్లకు పెంచుతూ వర్సిటీ భవన నిర్మాణ కమిటీ నిర్ణయం తీసుకుంది. పనుల పర్యవేక్షణ కోసం ఏపీ డబ్ల్యూఐడీసీతో ఒప్పందం చేసుకున్నారు. పనులు పర్యవేక్షించినందుకు గాను పనుల విలువలో నాలుగు శాతం, క్వాలిటీ కంట్రోల్ పనులను పర్యవేక్షించినందుకు గాను 0.5. శాతం చార్జీల రూపంలో చెల్లించేలా 2022 డిసెబరులో, 2023 జనవరిలో రెండు విడతలుగా ఒప్పందం కుదుర్చుకున్నారు. మరోవైపు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్‌లో ఈఈగా పదవీ విరమణ చేసిన ఒకరిని పనుల పర్యవేక్షణ నిమిత్తం నెలకు రూ.50వేల జీతంతో, మరో ప్రైవేటు ఇంజనీరును రూ.25వేల జీతంతో నియమించారు. కూటమి ప్రభుత్వం రాకతో వీరిని తొలగించారు.

పునాదుల దశ దాటని హాస్టల్ భవనాలు

కృష్ణా యూనివర్సిటీ 2008లో ప్రారంభమైంది. 2019 జనవరి వరకు మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాలలో యూనివర్సిటీ కొనసాగింది. మచిలీపట్నం మండలం రుద్రవరం గ్రామ పరిధిలో రూ.87 కోట్లతో నిర్మాణం చేసిన నూతన భవనాల ప్రాంగణంలోకి 2019 జనవరిలో మారింది. యూనివర్సిటీకి అప్పటి నుంచి వసతిగృహాలు సమకూరలేదు. యూనివర్సిటీలో హాస్టల్‌వసతి లేకపోవడంతో ఆయా కోర్సులలో చేరేందుకు విద్యార్థినీ, విద్యార్థులు వెనుకంజవేస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన వారు కౌన్సెలింగ్ ద్వారా ఈ యూనివర్సిటీలో సీట్లు వస్తే తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ చేరుతున్నారు. మచిలీపట్నంలోని ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటున్నారు. ప్రతిరోజు ఏడెనిమిది కిలోమీటర్ల మేర రాకపోకలు సాగిస్తున్నారు.

భారీగా పెరిగిన అంచనాలు

కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో బాలుర వసతి గృహానికి రూ.8.69 కోట్లతో అంచనాలు రూపొందించి ఈ మొత్తాన్ని రూ.5.49 కోట్లకు తగ్గించారు. బాలికల వసతిగృహానికి తొలుత రూ.8.69 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ మొత్తాన్ని రూ.14.62 కోట్లకు పెంచారు. మూడేళ్ల కిందట ఈ రెండు హాస్టల్ భవనాల నిర్మాణం ప్రారంభించినా పనులు పునాదుల దశను నేటికీ దాటలేదు. ఫార్మసీ కళాశాల భవనం నిర్మాణం అంచనాను రూ.6 కోట్ల నుంచి రూ.10.01 కోట్లకు పెంచారు. ఈ భవనం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇంజనీరింగ్ కళాశాల భవనం అంచనాలను రూ.6.20కోట్ల నుంచి రూ.4.21 కోట్లకు తగ్గించారు. ఈ భవనం పునాదుల దశలోనే ఉంది. ఫుడ్‌కోర్టు అంచనాలను రూ.1.50 కోట్ల నుంచి రూ.3.20 కోట్లకు పెంచారు. ఈ భవన నిర్మాణం పూర్తయింది. ఇందులో కొంత భాగాన్ని యూనివర్సిటీలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌కు కేటాయిస్తామని చెప్పినా ఇంత వరకు ఈ ఫుడ్‌కోర్టు భవనాన్ని ప్రారంభించలేదు. యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.3.02 కోట్లతో రూపొందించిన అంచనాలను రూ.4.80కోట్లకు పెంచారు. ప్రహరీ నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. ప్రధాన గేటు, ఆర్చ్ నిర్మాణం కోసం అంచనాలను రూ.30లక్షల నుంచి రూ.72లక్షలకు పెంచారు. అంచనాలను పెంచడం, పనులు చేయకపోయినా కోట్లాది రూపాయల బిల్లులు చెల్లించడంలో గతంలో పనిచేసిన వర్సిటీ అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడం వెనుక కారణాలు ఏమై ఉంటాయనే అంశంపై చర్చ జరుగుతోంది.

యూనివర్సిటీ ప్రాంగణంలోకి నీరు

యూనివర్సిటీ ప్రాంగణం 102.50 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు యూనివర్సిటీ ఎదురుగా ఉన్న డ్రెయినేజీ పొంగిపొర్లడంతో ప్రాంగణంలోకి పెద్ద ఎత్తున నీరు చేరింది.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్న
అధికారులపై దౌర్జన్యం

- వైసీపీ సర్పంచ్ భర్త, ట్రాక్టర్ డ్రైవర్‌పై పోలీసులకు ఫిర్యాదు
- చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



చల్లపల్లి మండలం నడకుదురు రేవులో పగలే ఇసుక రవాణా

చల్లపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవటం అధికారులకు కత్తిమీద సాములా మారింది. చల్లపల్లి మండలంలో ఎక్కడో ఒక చోట ఇసుక రవాణా జరుగుతూనే ఉంది. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో నిమ్మగడ్డ రేవులో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసు అధికారులపై దౌర్జన్యం, దాడి జరిగిన విషయం తెలిసిందే. ఆముదార్లంకలో ఇసుక రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ, పోలీసు బృందాన్ని ట్రాక్టరు డ్రైవర్లు ముప్పుతిప్పలు పెట్టి చల్లపల్లి వచ్చేందుకు మొండికేసిన సంగతి తెలిసిందే. తాజాగా శనివారం నడకుదురులో ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దౌర్జన్యం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ సంఘటనపై వైసీపీ సర్పంచ్ భర్త, ట్రాక్టర్ డ్రైవర్‌లపై చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా..

చల్లపల్లి మండలం నడకుదురు, నిమ్మగడ్డలో ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందంటూ రెవెన్యూ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు చల్లపల్లి మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో కోట కిరణ్‌కుమార్ నిమ్మగడ్డ, ఆ తర్వాత నడకుదురు వెళ్లారు. నడకుదురు రేవులోంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును అడ్డగించి చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా, పురిటిగడ్డ - యార్లగడ్డ రోడ్డు దగ్గర సర్పంచ్ భర్త మాతంగి దుర్గారావు అడ్డగించి రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. ట్రాక్టర్ ఆపేందుకు వీల్లేదనీ, డ్రైవర్‌ను ముందుకు తీసుకువెళ్లమని చెప్పటంతో అతను ట్రాక్టర్‌ను ముందుకు తీసుకువెళ్లిపోయాడు. మళ్లీ అధికారులు అడ్డగించగా, సర్పంచ్ భర్త దుర్గారావు తానే స్వయంగా ట్రాక్టర్‌ను నడుపుకు వెళ్లి ఇసుకను అన్‌లోడ్ చేశాడు. ట్రాక్టర్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించగా ట్రాక్టర్‌ను ముందుకు దూకించటంతో వారు అడ్డుతప్పుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ మాతంగి నాంచారయ్య సైతం రెవెన్యూ అధికారులను తోసివేయటం, బైక్‌పై ముందుకు వెళ్లనీయకుండా అడ్డుకోవటం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించిన ఇరువురిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో కె.కిరణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్ఐ పి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

భక్తజన కీలాద్రి

» దుర్గామల్లేశ్వరుల దర్శనానికి పోటెత్తిన భక్తులు

వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆదివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్తీకమాసం కావటంతో దుర్గా మల్లేశ్వరస్వామిని భక్తులు దర్శించుకు



న్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చండీహోమం, శ్రీచక్ర నవావరణార్చన, లక్ష కుంకుమార్చన, ఖడ్గమాల, శాంతి కళ్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఈవో రామారావు ఆదేశాల మేరకు అధికారులు భక్తుల శీఘ్ర దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

దుర్గమ్మ సేవలో గరికపాటి నరసింహారావు



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు, అర్చకులు సాదర స్వాగతం పలికారు.

అన్నవితరణకు విరాళం

హైదరాబాద్ కూకట్‌పల్లి సాయిబాబానగర్‌కు చెందిన మోటుపల్లి సురేశ్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దుర్గమ్మను దర్శించుకుని అన్నవితరణ నిమిత్తం రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అధికారులకు అందజేశారు.

అమ్మవారికి కాసులపేరు కానుక



విజయవాడ గొల్లపూడి నివాసి ఎ.సూరిబాబు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారికి అలంకరణ నిమిత్తం 65 గ్రాముల బంగారు కాసుల పేరు కానుకగా అందజేశారు.

అఖండ ధ్యాన యజ్ఞం

దుర్గగుడిలో ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు 12 గంటల పాటు అఖండ ధ్యానయజ్ఞ కార్యక్రమం జరిగింది. ధ్యాన యజ్ఞంలో పలువురు మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

సూర్యోపాసన సేవ



లోకక్షేమం కోరుతూ సకల జనుల ఆయురారోగ్యాలను కాపాడలంటూ సంకల్పం చెప్పి దేవస్థానం అర్చకులు, వేదపండితులు ఆదివారం సూర్యోపాసన సేవ చేశారు. సూర్యనారాయణ మూర్తికి అర్చనలు చేశారు. మంత్రపుష్పం, హారతులు సమర్పించి భక్త జనులకు ఆశీస్సులు అందజేశారు.



కళా వేదిక పై శాస్త్రీయ నృత్యం

కళావేదికపై ఆదివారం విశాఖపట్నానికి చెందిన నవ్యా నాట్యమండలి బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసింది. మహాగణపతి, విజయకనకదుర్గ, నవదుర్గా, అష్టలక్ష్మీ, ప్రణవలయ తదితర కీర్తనలకు చక్కని అభినయంతో ఆహుతులను అలరించారు. కళాకారులను ఈవో అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు.



కనకదుర్గానగర్‌లో దేవస్థానానికి చెందిన షాపు

షాపు ఖాళీచేయమంటే కోర్టుకు ..

» దుర్గగుడికి రూ. 6 లక్షలకు పైగా అద్దె బకాయి

వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానానికి చెందిన షాపు లీజు పూర్తికావడంతో ఖాళీ చేయమన్నందుకు అద్దెదారుడు కోర్టుకు వెళ్లాడు. దేవస్థానానికి చెల్లించాల్సిన అద్దె కూడా చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. దుర్గగుడి అధికారులు 2021 సంవత్సరం చివరిలో కనకదుర్గానగర్‌లో అల్పాహారం, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్, ఐస్‌క్రీమ్‌లను మొబైల్ వాహనం ద్వారా విక్రయించుకునేందుకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో విశాఖపట్నం మరిడిమాంబ ఆలయ సమీపంలోని కనకాల వీధికి చెందిన సూరిశెట్టి గణేశ్ ఏడాదికి రూ.11.25 లక్షల అద్దె, అదనంగా జీఎస్టీ 18 శాతం దేవస్థానానికి చెల్లించే విధంగా రెండేళ్ల పాటు లీజుకు పాడుకున్నాడు. రెండో సంవత్సరానికి మొదటి సంవత్సరం లైసెన్స్ సొమ్ముపై పదిశాతం అదనంగా చెల్లించాలి. సుమారు మూడు నెలల క్రితం అతడి లీజు కాలపరిమితి ముగియడంతో అధికారులు షాపు ఖాళీ చేయాలని సూచించారు. అద్దెదారుడు షాపు ఖాళీ చేయకుండా కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఈ ఏడాది డిసెంబరు 31 వరకు షాపు నిర్వహించుకునేందుకు గడువు ఇచ్చింది. అయితే బకాయి పడ్డ సుమారు రూ.6లక్షలకు పైగా చెల్లించకుండా అద్దెదారుడు కాలయాపన చేస్తున్నాడు. ఈ వ్యవహారంపై ఈవో కేఎస్ రామారావును వివరణ కోరగా, షాపు అద్దెదారుడు లీజు కాలపరిమితి ముగియటం వాస్తవమేనని, దేవస్థానానికి బకాయి చెల్లించాలని తెలిపారు. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నందున లీగల్‌గా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చదువొక్కటే బాల్యం కాదు

» పిల్లల్లో సృజనాత్మకత పెంచాలి

» వారి వికాసానికి ప్రత్యేక మండలి ఏర్పాటు చేయాలి

» ఎమ్మెల్సీ లక్ష్మణరావు డిమాండ్



పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

మొగల్రాజపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ ప్రపంచంలో చదువు ప్రధానం అయిందని, కానీ పిల్లల్లో మానసిక వికాశం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెరగాలంటే వారిని క్రీడలు, సాంస్కృతిక కళారంగాల్లో ప్రతిభను నిరూపించుకునే విధంగా అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహించాలని శాశనమండలి



సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు సూచించారు. ఇందుకు తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వాలుచేయాల్సిన పనిని బాలోత్సవ కమిటీలు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాల్లో కంటే ప్రభుత్వ పాఠశాల్లో చదువుకునే పిల్లలే ఎక్కువగా ఉన్నారని, వారిని చదువుతో పాటు వివిధ రంగాల్లో ప్రోత్సహించేలా ప్రత్యేక మండలిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ మూడు రోజుల కార్యక్రమం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 78 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో, 37 లక్షల మంది ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని చెప్పారు. కొత్త గూడెం బాలోత్సవ వ్యవస్థాపకులు వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ, ప్రతిమనిషి జీవితంలో బాల్యం ఒక అపురూప ఘట్టం అని అన్నారు. బాల్యం మొత్తం చదువు అంశమే ఉంటే వారిలో సృజనాత్మక శక్తి ఉండదన్నారు. ఒకపుడు ఆటలు, చదువు రెండూ బాల్యంలో ఉండేవని చెప్పారు. పెద్దలంతా కలిసి ఇపుడు బాలోత్సవం పేరిట నిర్వహిస్తుంటే తమ బాల్య స్మృతులు గుర్తుకు వస్తున్నాయన్నారు. బాలోత్సవంలో పాల్గొనే పిల్లల్లో మార్పు వస్తుందని, జీవితం పట్ల ఒక దృక్పథం ఏర్పడుతుందని, భవిష్యత్‌ను నిర్మించుకోవడంలో మంచి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కాకినాడ క్రియ పిల్లల పండగ అధ్యక్షులు ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు మాట్లాడుతూ, పిల్లలకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు లేకుండా చదువులో ఏకాగ్రత, పరిపూర్ణత ఉండదన్నారు. కెనరాబ్యాంకు జీఎం సీజే విజయలక్ష్మి, ఏపీ యంఎస్‌యంఈ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు బాయన వెంకట్రావు తదితరులు మాట్లాడారు. మూడోరోజు మాప్, సైన్సు ఎగ్జిబిషన్, డిబేట్, క్విజ్, తెలుగులో మాట్లాడటం, పద్య భావం, కథ చెప్పడం, మెమరీ టెస్ట్, నాటకీకరణ, ఇన్‌స్ట్రుమెంట్‌మ్యూజిక్, ఏకపాత్రాభినయం, జానపదగీతాలాపన,కోలాటం మూకాభినయం పోటీలు నిర్వహించారు. బాలోత్సం అధ్యక్షులు ఎస్వీ రామరాజు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావులు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో 400 పాఠశాలల నుంచి 12వేలమంది పిల్లలు, యాజమాన్యాలు పాల్గొన్నాయి.

ప్రజల్ని చైతన్యపరిచేదే ఉత్తమ సాహిత్యం



కవులను సత్కరిస్తున్న మొండెపు ప్రసాద్, జిల్లా న్యాయాధికారి మంగారి తదితరులు

విజయవాడ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్ని నిద్రావస్థ నుంచి మేల్కొలిపి చైతన్యపరిచే రచనలు రావాలని, అవి ఉత్తమ సాహిత్యంగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలుస్తాయని ప్రముఖ సాహితీవేత్త, ఐఆర్ఎస్ అధికారి మొండెపు ప్రసాద్ అన్నారు. ఆదివారం ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్వర్యంలో ఎక్స్‌రే మాసపత్రిక జాతీయస్థాయిలో నిర్వహించిన కవితల పోటీ విజేతలకు అవార్డుల బహూకరణ సభ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాలులో జరిగింది. సభలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, కవి సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. కాలక్షేపం కోసం కవిత్వం కాదు, జీవితపు లోతుల్ని దర్శించేలా కవిత్వం వుండాలన్నారు. జిల్లా సెషన్స్ న్యాయాధికారి మంగారి రాజేందర్ (జింబో) ప్రసంగిస్తూ కవి అధ్యయనం ద్వారా మంచి సాహితీ సృజన జరుగుతుందన్నారు. కవితల పోటీల్లో ప్రధాన విజేత కరీంనగర్‌కు చెందిన నామని సుజనా దేవిని రూ.12 వేల నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఉత్తమ అవార్డు గ్రహీతలుగా కోరాడ అప్పలరాజు (అనకాపల్లి), చొక్కర తాతారావు (విశాఖపట్నం), ఎస్.లహరి, రాధశ్రీ (హైదరాబాద్) రేపాక రఘునందన్ (తిరువూరు), వెంకు సనాతని (బాపట్ల), పోతూరి సీతారామరాజు (కాకినాడ), కమలేష్ (శంకరపల్లి, రంగారెడ్డి జిల్లా), రమాదేవి (స్టేషన్ ఘనాపూర్), జగన్నాధం రామమోహన్ (కొత్తూరు, నెల్లూరు)లను సత్కరించారు. సంచికను శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఎక్స్‌రే మాసపత్రిక సంపాదకులు కొల్లూరి సభకు అధ్యక్షత వహించారు. సంస్థ ఉపాధ్యక్షులు కందికొండ రవికిరణ్, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, పొత్తూరి సీతారామారావు పాల్గొన్నారు.

మంత్రశక్తి వైజ్ఞానికం

» పద్మశ్రీ గరికపాటి నరసింహారావు



వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మంత్రశక్తి పూర్తిగా వైజ్ఞానికమని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు అన్నారు. ఎస్కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ, దుర్గామల్లేశ్వర దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమాలను రెండు రోజులపాటు నిర్వహించారు. కేబీఎన్ కళాశాల వేదికగా సాగిన ఈ కార్యక్రమంలో ఆదివారం ఆయన కనకదుర్గానందలహరిపై ప్రవచనం చేశారు. అనేక అంశాలపై ఆయన మాట్లాడుతూ, మంత్రశక్తి పూర్తిగా వైజ్ఞానికమైనదని, మంత్ర, తంత్ర, యంత్రాలలో ఉన్న రహస్యాలను సోదాహరణంగా వివరించారు. విశాలాక్షి, కామాక్షి, కనకదుర్గ, ఇలా ఎన్నో పేర్లతో అవతారాలు దాల్చినప్పటికీ లోక రక్షణకోసమేనని సోదాహరణంగా వివరించారు. తల్లి రూపంలో జగన్మాత సృష్టిలో సమస్త ప్రాణులను కాపాడుతున్నదన్నారు. పరమ భాగవతాదులకు ఇబ్బందులు కలిగినప్పుడు ఆమె అనేక రూపాల్లో వచ్చి రక్షించిన తీరును ఆయన పేర్కొన్నారు. పురుషులు ఎంత గొప్ప వారైనప్పటికీ భార్య లేనిదే పుణ్యం సంపాదించుకోలేదని, దాంపత్య జీవనంలో భార్యాభర్తల శరీరాలు వేరైనప్పటికీ, మనస్సులు మాత్రం ఒక్కటిగానే ఉంటాయని చెప్పారు. బిడ్డనుంచి తల్లి ఏమీ ఆశించకుండా ప్రేమను ఎలా పంచుతుందో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు కూడా భక్తులైన తన పిల్లలకు ప్రేమ పంచుతుందని చెప్పారు. అమ్మవారు తల్లితో సమానమని, జగన్మాతను ఆరాధించిన ఆదిశంకరాచార్యులు, భక్త పోతన, కాళిదాసు వంటి వారు రాసిన పద్యాలను, వాటి అర్థాలను వివరించారు. ముగింపు కార్యక్రమంలో గరికపాటిని సముచిత రీతిన సత్కరించారు. దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ టి.శ్రీనివాస్, హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రెసిడెంట్ టి.శేషయ్య, గోళ్ల బాబ విజయకుమార్, దుర్గగుడి అధికారులు, నరసింహారావును సత్కరించిన వారిలో ఉన్నారు.



మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులతో సినీ హీరో, వైఎంకే చైర్మన్ సుమన్

ఆత్మరక్షణపై యువత దృష్టి పెట్టాలి

» సినీ నటుడు సుమన్

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆత్మరక్షణ విద్యలపై విద్యార్థులు, యువత దృష్టిపెట్టాలని సినీ హీరో, వైఎంకే అకాడమి చైర్మన్ సుమన్ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జుల సరళాదేవి కళ్యాణ మండపంలో వైఎమ్‌కే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. కార్యక్రమానికి సుమన్ ముఖ్యతిథిగా హాజయయ్యారు. కరాటే, కుంగ్‌ఫూ, లైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ విభాగాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సుమన్ మహూమతులు, సర్టిఫికెట్‌లు, బెల్ట్‌లు ప్రధానం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తనను తాను రక్షించుకోవడానికి కరాటే వంటి మర్శకళలు నేటి సమాజంలో అవసరమని అన్నారు. కార్యాక్రమ నిర్వాహకులు వైఎమ్‌కే అకాడమీ టీమ్ ప్రముఖులు రూఫాస్ పాల్, డీ శ్రీనివాస్, జీ ప్రకాశ్‌రావులను ఆయన అభినందించారు.

రామ్మూర్తినాయుడు మృతి పార్టీకి తీరని లోటు

» వేర్వేరు చోట్ల టీడీపీ నేతల నివాళి

వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడుకు పలువురు టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయుడు చేసిన సేవలను కొనియాడారు. ఆదివారం ఆటోనగర్‌లోని



రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్

జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ తదితరులు రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేతలు పి.కిషోర్ బాబు, యార్లగడ్డ రమేష్, సీహెచ్ కిషోర్, ఎం.విజయకుమార్, డి.వెంకటేశ్వరరావు, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

● గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, ఎస్సీసెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తదితరులు నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గంపలగూడెం మండల తెలుగుయువత అధ్యక్షుడు మాని కొండ రామకృష్ణ, పటమట సతీష్ చంద్ర, పి.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● హనుమాన్‌పేటలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి గన్నేప్రసాద్ రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 52వ డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, యలమంచిలి శ్రీనివాస



ఆటోనగర్ జిల్లా టీడీపీ కార్యాలయంలో..

రావు, కరణం జగన్మోహన్, బి.డి. ప్రసాద్, బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● వించిపేటలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ నారా రామ్మూర్తి నాయుడుకు ఘన నివాళులు సమర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బి.కనకారావు, బి.సాయి సుధాకర్, అబ్దుల్ సత్తార్, ఎ.మోహన్‌రావు, ఎన్.భానుప్రకాష్, దేవరకొండ చక్రవర్తి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మహోన్నత వ్యక్తిని కోల్పోయింది

భవానీపురం : టీడీపీ కుటుంబం మహోన్నత వ్యక్తి



నారా రామ్మూర్తినాయుడును కోల్పోయిందని, ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్ అన్నారు. విజయవాడ పశ్చిమలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పత్తి నాగేశ్వరరావు, బొడ్డుపల్లి శ్రీనివాసరావు, కొనికి కొండయ్య, ముదిగొండ శివాజీ, జాలాది వెంకటేశ్వరావు, ఆర్యవైశ్య నాయకులు వీవీకే నరసింహారావు, తుమ్మలపెంట శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు తదితరులు నివాళి అర్పించారు.

రామ్మూర్తినాయుడు మృతి విచారకరం..

ధర్నాచౌక్ : నారా రామ్మూర్తినాయుడు మృతిపట్ల ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు, రామ్మూర్తి నాయుడు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆయన ఎనలేని సేవ చేశారన్నారు. ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.



కానుమోలు వద్ద దగ్ధమవుతున్న కారు

రోడ్డుపై కారు దగ్ధం!

» ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : షార్టు సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటల్లో ఓ కారు (ఏపీ 28 సీజీ 5649) చిక్కుకుని దగ్ధమైన ఘటన బాపులపాడు మండలం కానుమోలు గ్రామం వద్ద ఆదివారం జరిగింది. విజయవాడకు చెందిన తండ్రీ కొడుకులు ఏలూరులోని స్నేహితుడి వద్ద కారు తీసుకొని పెడన పెళ్లికి వెళ్లారు. తిరిగి పెడన నుంచి ఏలూరు వెళుతుండగా కానుమోలు వద్ద కారులోంచి మంటలు చెలరేగాయి. దీంతో తండ్రీకొడుకులిద్దరు కారు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. జంక్షన్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. జంక్షన్ ఎస్సై-2 లక్ష్మీనరసింహమూర్తి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

చిట్టినగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఇనుప చువ్వలను తీసుకు వెళుతుండగా విద్యుత్ తీగలు తగలడంతో వ్యక్తిదుర్మరణం చెందాడు. వైఎస్సార్ కాలనీ బ్లాక్ నంబరు172కి చెందిన చల్లా రత్నకుమార్(25) కూలీ పనులు చేస్తుంటాడు. రెండు రోజులుగా బ్లాక్‌లో ప్లంబింగ్ పనులు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇనుప పైపులు పైకి తీసుకెళ్తుండగా 11కేవీ విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. ఘటనలో రత్నకుమార్ అక్కడికక్కడే చనిపోయాడు. కేసును కొత్తపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ కార్యకర్తపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

వన్‌టౌన్ : అనంతపురం జిల్లా, బొమ్మనహాల్ మండలం, చంద్రగిరి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కృష్ణమూర్తి శెట్టిపై వేటకొడవళ్లతో దాడిచేసి హత్యకు ప్రయత్నించిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినశిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు విజయవాడలోని రాష్ట్ర కార్యాలయం నుంచి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణమూర్తి శెట్టి కుటుంబం ధైర్యంగా ఉండాలని, ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. కృష్ణమూర్తి శెట్టిపై అత్యంత పాశవికంగా దాడిచేసిన ఘటనలో పాత్రధారులు, సూత్రధారులు అందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణమూర్తి శెట్టికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు మధ్య
విభజన రేఖ అవసరం

» హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.సుధ

ధర్నాచౌక్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, సామ్యవాదం, లౌకిక వాదం రాజ్యాంగంలో మౌలిక అంశాలని ఈ మధ్య దీనికి విరుద్ధంగా ఉన్నత న్యాయస్థానాలు తీర్పునిస్తున్నాయని మానవ హక్కుల వేదిక(హెచ్‌ఆర్‌ఎఫ్) రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.సుధ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వేదిక ఉమ్మడి కృష్ణాజిల్లా ఆరో మహాసభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వానికి, న్యాయ వ్యవస్థకు మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉండాలన్నారు. దీన్ని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రాథమిక విద్యారంగం సంక్షోభంలో ఉందని హెచ్‌ఆర్‌ఎఫ్ సభ్యురాలు, విద్యారంగ నిపుణురాలు ఎం.శ్రావ్య అన్నారు. ప్రైవేట్ రంగానికి పెద్దపీట వేయడమే దీనికి కారణమన్నారు. ప్రభుత్వమే ప్రాథమిక విద్యారంగాన్ని నడుపుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం ద్వారా ఈ రంగాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్ల డం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై.రాజేష్ అధ్యక్షతన నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నేత టి.ఆంజనేయులు, కవి మొహి ద్దీన్, ఉషా డానీ, వేదిక సభ్యులు జి.రోహిత్, శ్రావణి, రోహిత్‌చంద్ర పాల్గొన్నారు.

‘అంతరంగ వీక్షణం’ ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్‌రావు సాహితీవేత్తలతో నిర్వహించిన ముఖాముఖీల సంకలనం ‘అంతరంగ వీక్షణం’ గ్రంథావిష్కరణ చేశారు. సభకుసాహిత్య ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ అధ్యక్షత వహించారు.

యోగా మార్గంతో శాంతి, సౌభాగ్యాలు

» రీజనల్ ఇన్‌చార్జి రాజయోగిని బ్రహ్మకుమారి సవిత

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపిత బ్రహ్మకుమారి యోగమార్గం అనుసరించడం ద్వారా శాంతి, సౌభాగ్యాలు చేకూరుతాయని వరంగల్, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల రీజనల్ ఇన్‌చార్జి రాజయోగిని బ్రహ్మకుమారి సవిత అన్నారు. మచిలీపట్నం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖ 40వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సుమ కన్వెన్షన్ హాలులో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బ్రహ్మకుమారిలు, యోగసాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజయోగిని బ్రహ్మకుమారి సవిత మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ఎంత ధనమున్నా శాంతికి దూరంగా ఉన్నారన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయంలో నేర్పే యోగసాధన వల్ల మానవాళికి శాంతియుత జీవనం చేకూరుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వందలాది శాఖల్లో నిర్వహిస్తున్న ఈశ్వరీయ విశ్వవిద్యాలయాల్లో ప్రతి రోజూ రాజయోగాన్ని బోధిస్తున్నారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు వ్యాపారులు, విద్యావేత్తలు రాజయోగాన్ని అభ్యసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి శాంతతో పాటు సుధాకరమూర్తి తదితరులు ప్రసంగించారు. కేకులు కట్ చేశారు. ఈ సత్సంగంలో ధ్యాన మార్గంపై పలువురు ప్రసంగించారు.




జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీలు



దత్తగుడిలో లక్ష తులసీ పూజ

ఉయ్యూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట గణపతి సచిదానంద జ్ఞానబోధ సభ ఆవరణలో అనఘాసమేత దత్త దిగంబర స్వామి అవతార జయంతి పురస్కరించుకుని లక్షతులసీ పూజ భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, పంచామృత అభిషేకం, నవగ్రహపూజ, గోపూజ, హోమం ఘనంగా నిర్వహించారు. ఉయ్యూరు, గండిగుంట పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని పూజలు చేశారు. అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన చేశారు.



పడకేసిన పారిశుధ్యం!

- సర్వీసు రోడ్లు, ప్రధాన రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తకుప్పలు
- డంపింగ్ యార్డుల్లా రోడ్లు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

గండిగుంట గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్లపక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు, మురుగు కాల్వలతో పారిశుధ్యం అధ్వానస్థితికి చేరుకుంది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శన మిస్తూ వాటి నుంచి వస్తున్న దుర్గంధంతో రోడ్డున వెళ్లేవారు ముక్కుమూసుకుని వెళ్ల వలసిన పరిస్థితి నెలకొంది. ప్రధాన సెంటర్ సమీపాన, దత్తఆశ్రమం సర్వీసు రోడ్లపక్కన, కాటూరు రోడ్డులో ఆర్డీవో కార్యాలయం గేటు సమీపాన చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కాటూరు రోడ్డు అండర్ పాస్ నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోయినా పంచాయతీ సిబ్బంది పట్టించుకోపోవడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాటూరు రోడ్డులో అండర్‌పాస్ నుంచి జాతీయ రహదారి పక్కన గండిగుంట వచ్చే సర్వీసు రోడ్డులో ఉయ్యూరు, గండిగుంట నుంచి ట్రాక్టర్లు, రిక్షాలు, తోపుడు బండ్లపై వ్యర్థాలు, చెత్త తీసుకువచ్చి పోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డులా తయారై రోడ్డుపై వెళ్లేవారికి అసౌకర్యం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీసు రోడ్ల వెంబడి చెత్తవేయకుండా చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు.



కాటూరు రోడ్డు అండర్‌పాస్ సమీపాన సర్వీసు రోడ్డు వెంట డంపింగ్‌యార్డులా చెత్తకుప్పలు



ఉండవల్లి శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న దేవినేని రాజా

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

కంకిపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఉండవల్లి శ్రీదేవిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి మాదిగల ఉన్నతికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏలూరు కాలువలో పడి యువకుడు గల్లంతు

గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడి అంత్యక్రియలకు వెళ్లి ప్రమాదవశాత్తు ఏలూరు కాలువలో పడిపోయి గల్లంతైన సంఘటన ఉంగుటూరు మండలం పొట్టిపాడులో జరిగింది. ఆత్కూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఆర్టీసీ డ్రైవర్ వెంకట వంశీకృష్ణ పురుగుమందు తాగి మృతి చెందగా అతని అంత్యక్రియలు శనివారం రాత్రి జరిగాయి. అక్కడికి వెళ్లిన దేవేంద్ర వెంకట సత్యనారాయణ పొట్టిపాడు దగ్గర ఉన్న ఏలూరు కాలువ ర్యాంపుపై పడుకుని ఉండగా ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయినట్లు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేసి అతని కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.



ఉయ్యూరు 16వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదులో నాయకులు

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

ఉయ్యూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా జరుగుతుంది. 16వ వార్డులో పార్టీ అధ్యక్షుడు ఆరేపల్లి సుబ్బారావు, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, పట్టణ యూనిట్ ఇన్‌చార్జ్ చలపాటి శ్రీనివాసరావు ఇతర నాయకులు కలసి వార్డులో పర్యటించి పార్టీ సభ్యత్వం తీసుకోవడం వల్ల ప్రయోజనాలు వివరిస్తూ పలువురిని పార్టీలో చేర్పించారు.



మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా కుంభాభిషేకం

విజయవాడ కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురు రామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అష్టబంధన మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ముఖ్య అర్చకులు జీఆర్‌వీ దేవస్థానంపై కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు రామలింగేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు పాల్గొన్నారు. సోమవారం ఉదయం విధుశేఖర భారతీస్వామి ఆలయానికి రానున్నారు. అష్టబంధం మహా కుంభాభిషేకం చేస్తారని, మరి కొన్ని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.భవానీ తెలిపారు.

ఉత్సాహంగా వన సమారాధన

హనుమాన్‌జంక్షన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ఆదివారం ఉత్సాహంగా బాపులపాడు మండలంలో కాపు, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కాపు సంఘం ఆధ్వర్యంలో వీరవల్లిలో వనసమారాధన నిర్వహించారు. కాపు సంఘం నాయకుడు కోడెబోయిన బాబీ, ఆత్కూరి బాలాజీ, తోట సుధీర్, జక్కుల రంగారావు, రాయపాటి ఆధ్వర్యంలో ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. నూజివీడు రోడ్డులోని పామాయిల్ తోటలో ఆ సంఘం నాయకులు కొనకళ్ల రాజశేఖర్ నాయకత్వంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఉసిరిచెట్టుకు పూజలు



దేవతామూర్తులకు క్షీరాధివాసం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

దేవతామూర్తులకు ఘనంగా క్షీర, జలాధివాసం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక ధర్మ కోనేరు చెరువు గట్టు మీద నిర్మించిన భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఈ నెల 20న ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులకు ఆదివారం ఘనంగా జల, క్షీరాధివాసం నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠించే మరకతలింగం, భ్రమరాంబ అమ్మవారు, వీరభద్ర స్వామి, శివపార్వతులు, ఆంజనేయస్వామి, గణపతి, నాగేంద్రస్వామి, చండీశ్వరస్వామి నూతన విమానకలశం, నందీశ్వరుడు, నూతన రాతి ధ్వజస్తంభాలకు పాలు, జలంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్, వీరమాచనేని నాగయ్య పర్యవేక్షించారు.



శ్రమదానం చేస్తున్న రెడ్ వలంటీర్లు

రెడ్ వలంటీర్ల సేవలు ఆదర్శనీయం

గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌వలంటీర్‌లు చేస్తున్న సామాజిక సేవలు ఆదర్శనీయమని ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల రోడ్డులో ఆదివారం సుందరయ్య రెడ్ వలంటీర్‌లు శ్రమదానం ద్వారా ముళ్ల పొదలను తొలగించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వమే అన్ని కార్యక్రమాలను చేయలేదని, యువకులు సంఘాలుగా ఏర్పడి సామాజిక సేవలో భాగస్వాములు కావటం అభినందనీ యమన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి శ్రమదానం చేయటం గొప్ప విషయమన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి చిన్ని మాధవి, మల్లంపల్లి ఆంజనేయులు, కళ్లం కోటయ్య, మిరప నాగేశ్వరరావు, సూరగాని సాంబశివరావు, నాగరాజు, కళ్లం వెంకటేశ్వరరావు, చిటికెల రాజేశ్వరరావు, కడవకొల్లు రామరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలందించాలి

నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ వైద్యశాలలకు దీటుగా వైద్యసేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలిసిన బాధ్యత ప్రభుత్వ వైద్య శాల వైద్యులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులపైన ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందన్నారు. పాలకవర్గం, వైద్యులు, సిబ్బంది సంయుక్తంగా పనిచేసి వైద్యశాలకు వచ్చే రోగులకు సేవలందించాలన్నారు. ఇన్‌చార్జ్ చైర్మన్‌గా మండవ జయదేవ్, సభ్యులుగా బి.మాణిక్యం, గోపరాజు వినయ్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. ఉయ్యూరు చైర్మన్ వి. సత్యనారాయణ, మాజీ చైర్మన్లు పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, సర్పంచ్‌లు ఎస్.ప్రసాద్, బాషా, మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు, కె.ప్రవీణ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి



మాట్లాడుతున్న శాయోజీరావు

గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని రిటైర్డ్ ఇంగ్లీష్ అధ్యాపకుడు శాయోజీరావు అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పుస్తక పఠనంపై సెమినార్ నిర్వహించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతా రామారావు, గన్నె వెంకట్రావు, చిమట రామారావు, గ్రంథాలయ అధికారి దుర్గా లక్ష్మీ, రాజు, శంకర్ పాల్గొన్నారు. పురు షోత్తపట్నం గ్రంథాలయంలో కవి సమ్మేళనం, ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కృపానందం పాల్గొన్నారు.

విచిత్ర వేషాధారణ పోటీలు

ఉయ్యూరు : స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్నారులకు విచిత్రవేషాధారణ, దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. జాతీయ నాయకులు, పలుమతాలకు చెందిన వారి వేషధారణలతో బాలలు అలరించారు. సంగీతం ఉపాధ్యాయురాలు గూడ మాధవి న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



నున్న చినకంచి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

చినకంచి ఆలయంలో సామూహిక వ్రతాలు

విజయవాడ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలం నున్నగ్రామ సమీపంలోని శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి (చినకంచి) ఆలయంలో ఆదివారం ఉచిత సామూ హిక సత్యనారాయణస్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. 150 మంది దంపతులు వ్రతంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సంపూర్ణకృష్ణ యజుర్వేద పారాయణం జరిగింది. మధ్యాహ్నం కార్తీక వనసమారాధనలో రెండువేల మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ముక్కపాటి శర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



తాడిగడపలో భక్తుల పూజలు

తాడిగడప వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

పెనమలూరు : కార్తీకమాసం సందర్భంగా తాడిగడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు వేడుకగా జరిగాయి. షుమారు వంద జంటలకుపైగా పాల్గొని వ్రతాలు ఆచరించారు. స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నారా రామ్మూర్తి నాయుడు సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్





రామ్మూర్తినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విజయవాడ రూరల్ మండల టీడీపీ కార్యాలయంలో నేతల నివాళి


పెనమలూరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, దివంగత రామ్మూర్తినాయుడు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోడె వెంకట్రామ్, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు, అంగిరేకుల మురళి, షేక్ బుజ్జి, శొంఠి శివరాంప్రసాద్, పీతా గోపీచంద్, సంగెపు రంగారావు, తుమ్మల రాంకుమార్, బొంగరాల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదంపాడు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడుకు విజయవాడ రూరల మండలం టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం రూరల్ మండల టీడీపీ కార్యాలయంలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన రామారావు, ఉపాధ్యక్షుడు దాసరి మహేష్, ప్రసాదంపాడు మాజీ ఉప సర్పంచ్ గూడవల్లి నర్సయ్య, కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు జి. బాబూరావు, టీడీపీ నాయకులు బొప్పన హరికృష్ణ, గొడ్డళ్ల సత్యనారాయణ, అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య, కోనేరు నారాయణ, టీడీపీ రూరల్ మహిళా అధ్యక్షురాలు నెక్కంటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : మాజీ మంత్రి నారా రామ్మూర్తి నాయుడు మృతికి టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ఆరుమళ్ల కృష్ణారెడ్డి, జూపల్లి సురేష్, మండవ లక్ష్మీ, కంభంపాటి బాల నరేష్, జొన్నలగడ్డ సుధాకర్, మండవ అన్వేష్, షేక్ అబుల్యాజ్ చీమలదండు రామకృష్ణ, దేవినేని సులోచన, యనమదల సతీష్, మేడేపల్లి కాంతారావు, తలశిల రవి, నరేష్, అరుణ, యేసుబాబు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన మాజీ ఎమ్మెల్యే దివంగత నేత నారా రామ్మూర్తి నాయుడు జీవితం ఆదర్శనీయమని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన రామ్మూర్తి నాయుడుకు సంతాపం వ్యక్తం చేస్తూ ఆదివారం జంక్షన్ పట్టణ టీడీపీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులు నివాళులర్పించారు. రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షకార్యదర్శులు అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, నాయకులు మొవ్వా వేణుగోపాల్, లింగం శ్రీధర్, చిన్నాల లక్ష్మీనారాయణ, కొమ్మారెడ్డి రాజేష్, చలసాని శ్రీనివాస్, వరిగంజి కిషోర్, పొట్లూరి పణి, కర్రా ప్రసాద్‌పాల్, దయాల రాజీవ్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.





గన్నవరం టీడీపీ కార్యాలయంలో.. జంక్షన్ టీడీపీ కార్యాలయంలో..

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115,124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.575

రావికి ఘన సన్మానం

గుడివాడ, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమితులైన సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును పలువురు అభినందించారు. ఆదివారం స్థానిక ప్రజావేదికలో క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, మున్సిపల్ షాపుల అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గజవల్లి బాలకృష్ణ, కార్యదర్శి దొడ్డి పైడేశ్వరరావు, కోశాధికారి కొత్త సుబ్బారావు, సభ్యులు సయ్యద్ గఫార్, రవ్వ గుప్తా, మున్సిపల్ షాపుల అసోసియేషన్ అధ్యక్షులు కె.డి.వి.ఎస్ శ్రీనివాస్, అన్ని కాంప్లెక్సులకు చెందిన లీజుదారులు, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

పమిడిముక్కల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టి కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అధికారులు, ఉద్యోగులను హెచ్చరించారు. పమిడిముక్కలలో రైతుసహాయ కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించిన సందర్భంగా ఉద్యోగులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో రైతులు ఐదు సంవత్సరాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ధాన్యం అమ్ముకునేందుకు ప్రభుత్వం రైతులకు స్వేచ్ఛనిచ్చిందని, మార్కెట్‌లో ఎక్కువ ధర ఇస్తే రైతులు పంట అమ్ముకోవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు. నియోజవర్గంలోనే మొట్టమొదటిగా పమిడిముక్కలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి గణేశ్‌రెడ్డి, సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మేధోసంపత్తిని పెంపొందింప జేసేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని గ్రహించి వాటిని సద్వినియోగ పరచుకోవాలని పామర్రు గ్రంథాలయాధికారిణి ఎం ఝాన్సీరాణి అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు నేటి ఆధునిక యుగంలో చిత్రలేఖనం ప్రాముఖ్యతపై పోటీలను నిర్వహించారు. ఇదే విధంగా జమీగోల్వేపల్లి గ్రంథాలయాధికారి సురేష్ పర్యవేక్షణలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

పెదపారుపూడి : 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా యలమర్రు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి విజయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులచే వేమన పద్యాలు చెప్పించారు. అనంతరం బాలబాలికలచే మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలు నిర్వహించారు.

కూచిపూడి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మొవ్వ శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి టి.కృష్ణకుమారి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విజేతలైన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు అందించనున్నట్లు ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి తెలిపారు.

గుడివాడ : 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక షాగులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం నాలుగో రోజు లఘు నాటికల పోటీలను రచయిత వసుధ బసవేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఆలోచింపజేసాయి. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.



పండిన పంటను కాటా వేస్తున్న కూలీలు

వరి కోతలు ప్రారంభం

పెదపారుపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తుఫాను పొంచి ఉందన్న భయంతో రైతులు అప్రమత్తమయ్యారు. దీంతో వరి కోత యంత్రాలను ఉపయోగించి హడావిడిగా కోతలు ప్రారంభించి ధాన్యం వరి చేల నుంచి బయటకు తీసుకొస్తున్నారు. సంప్రదాయ కోతలు వల్ల ధాన్యం సేకరణ మరింత ఆలస్యమవుతుందని ఆలోచించి రైతులు హార్వెస్టర్లతో కోతలు ప్రారంభించారు. పెదపారుపూడి మండలంలో 7, 275 హెక్టార్లు వరి సాగు జరిగింది. తొలకరి పంటలు కోత దశకు చేరుకుని వారం రోజులైనా తుఫాను ప్రభావంతో రైతులు కొంత ఆలస్యంగా వరి కోతలు ప్రారంభించారు. అయితే ఆధునిక యంత్రాల ద్వారా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని వరి చేల నుంచి బయటకు తీసుకొచ్చే అవకాశం ఉండటంతో అధిక సంఖ్యలో హార్వెస్టర్లను ఉపయోగించి వరి కోతలు ప్రారంభించారు. సుమారు 20 శాతం వరి కోతలు ప్రారంభించారు. మరో వారం రోజుల్లో 50 శాతం మేరకు వరి కోతలు పూర్తవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

జనసేన బలోపేతానికి కృషి

పెదపారుపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ మండల, గ్రామస్థాయిలో బలోపేతమే ధ్యేయమని పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పేర్కొన్నారు.పెదపారుపూడి మండల జనసేన పార్టీ సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్ సూచనలతో పెదపారుపూడి మండలం వానపాముల గ్రామంలో పెదపారుపూడి మండల నాయకులు పోలిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ మండల, గ్రామస్థాయిలో బలోపేతం గురించి నాయకుల దగ్గర సలహాలు, సూచనలు తీసుకొన్నారు. పామర్రు నియోజకవర్గ ఐటీ కో-ఆర్డినేటర్ కాకర్ల దుర్గా ప్రసాద్, పెదపారుపూడి మండల నాయకులు,పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు - సమస్యల లోగిళ్లు

● ఇళ్ల మధ్య నిలిచిపోతున్న మురుగు నీరు ● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ) : గుడివాడ మండలం మల్లాయిపాలెంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం సమస్యలతో సతమతమవుతుంది. పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించకుండానే గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల లబ్ధి కోసం టిడ్కో గృహాలను పంపిణీ చేసింది. ఎంతో ఆశతో కాలనీకి వచ్చిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. మౌలిక సౌకర్యాలు కల్పించకుండా లబ్ధిదారులను నట్టేట ముంచారు. కేటాయించిన ఇంట్లోకి వెళ్లాలని లేదంటే రద్దు చేస్తామని బెదిరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ నివాసముంటున్నారు. వీధి దీపాల వరకు ఏర్పాటు చేశారు. ఇళ్లకు తాళాలు వేసి సుమారు 3000 కుటుంబాలు కాలనీని వీడి పట్టణంలోకి వచ్చేసాయి.



నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేరాము



వాటర్ ట్యాంక్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

నిధులు మంజూరు చేయాలి

గుడివాడ టిడ్కో కాలనీవాసులు ఎదు ర్కొంటున్న సమస్యలు, కాలనీ అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అసెంబ్లీలో ప్రస్తావించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో 8912టిడ్కో గృహాల నిర్మాణ పనులు 80శాతం మేర పూర్తైయ్యాయన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మిగిలిన 20శాతం పనులను పూర్తి చేయడంలో విఫలమైందన్నారు. కనీసం మౌళిక వసతులను కల్పించకుండా హడావుడిగా లబ్దిదారులకు ఇళ్ళను కేటాయించారని, దీంతో టిడ్కోకాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లబ్దిదారుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని, అదే విధంగా కాలనీలో అవసరమైన కార్యాలయాలు, విద్యాలయాలు, వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల కోరారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యే వెనిగండ్ల ప్రస్తావన

తాగునీటి కోసం తిప్పలు..

టిడ్కో కాలనీలో పలు బ్లాకుల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు సైతం నీరు సరఫరా చేయలేకపోవడం దారుణం. ముఖ్యంగా నీటి సరఫరా సరిగా లేకపోవడంతో కాలనీలో వచ్చి ఉండేందుకు లబ్ధిదారులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. కొందరు గృహప్రవేశం చేసినా నీరు లేకపోవడంతో తమ గృహాలకు తాళాలు వేసి తాము గతంలో నివసిస్తున్న పాత ఇళ్లకే వెళ్లిపోతున్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తైన సరిపడా నీటిని సరఫరా చేయడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు.

కాలనీ కంపు కొడుతోంది..

టిడ్కో అధికారులుగానీ, మున్సిపల్ అధికారులు గానీ శ్రద్ధ వహించకపోవడంతో పారిశుధ్య నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. చెత్త సేకరణకు సరిపడా వాహనాలు లేకపోవడం, పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేయడంలో మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. డంపింగ్ పాయింట్‌ను కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల మధ్యలో చెత్త పేరుకుపోతోంది. చెత్త సేకరణ వాహనం ద్వారా ఇళ్ల వద్ద చెత్తను మాత్రమే సేకరిస్తున్నారు. రహదారుల వెంబడి ఉన్న చెత్త జోలికి వెళ్లడం లేదు.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం..

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థతో టిడ్కో కాలనీలో మురుగునీరు సమస్య ఉత్పన్నమవ్వదని మాజీ ఎమ్మెల్యే నాని చెప్పిన మాటలు ఒట్టి బూటకం. దీని కోసం రెండు మురుగునీటి శుద్ధి ప్లాంట్‌లను ఏర్పాటు చేశామని అప్పట్లో బాకాలు ఊదారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సరైన మురుగునీరు పారుదల లేక బ్లాకుల మధ్య నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. నీటి నిల్వలు దోమలకు అవాసాలుగా మారాయని వాపోతున్నారు.

కాలనీవాసులకు రక్షణ ఏది..?

ఆర్భాటంగా టిడ్కో కాలనీని ప్రారంభించినా కాలనీ వాసులకు రక్షణపరంగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇల్లు వదిలి ఎక్కడికైనా వెళితే దొంగల బెడద ఎక్కువగా ఉంది. కాలనీలో శివారు బ్లాకుల వద్ద రక్షణ కరువైంది. రాత్రి 8 దాటితే బయటకు రావాలంటే భయపడుతున్నారు. పేకాట బ్యాచ్ బహిరంగంగానే రహదారులపైనే శిబిరాలను నిర్వహిస్తున్నారు. గంజాయి బ్యాచ్ అయితే బైక్‌లతో సర్కస్ ఫీట్లు చేస్తూ కలవరపెడుతున్నారు.

ఆకట్టుకున్న నాట్య పదర్శనలు

కూచిపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా నాట్య క్షేత్రమైన మొవ్వ మండలంలోని కూచిపూడి అగ్రహారంలో కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం ఇంటి వద్ద గల నాట్య శిల్పారామ కళావేదిక వద్ద ఆదివారం సాయంత్రం పురాణం విజయలక్ష్మి భాగవతార్ రాజమండ్రి వారిచే పార్వతీ కళ్యాణం హరికథా గానం తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహకారంతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ హరికథా గానానికి వయోలిన్ పాణ్యం దక్షిణామూర్తి మరియు మృదంగం పై మెహర్ సహకరించారు. తదుపరి కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ శిష్య బృందంగుడివాడ, నెల్లూరు విద్యార్థినులు హన్విక, సాయి, టి.గీతా కృష్ణ, హర్ష, రమ్యకృష్ణ, తపశ్య, శ్రీ షణ్ముఖ ప్రియ చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



నివాళులర్పిస్తున్న నేతలు

రామ్మూర్తి మృతికి సంతాపం

గుడివాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదికలో ఆది వారం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూరి నాయుడు సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, నాయకులు దింట్యాల రాంబాబు,పాల్గొన్నారు.

పామాయిల్ సాగు బహుబాగు

పమిడిముక్కల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పామాయిల్ వంటి వాణిజ్యపంటల సాగుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సహించి రైతులకు గిట్టుబాటు ధరతో లబ్ధిచేకూరేలా కృషి చేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పమిడిముక్కలలో 3 ఎఫ్ ఆయిల్ పామ్ నర్సరీని ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన రైతుల సమావేశంలో పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు వివరించి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎకరాకు సరిపడా పామాయిల్ మొక్కలు నూరుశాతం రాయితీతో అందిస్తుందని, ప్రతి ఎకరానికి అంతర్‌పంటగా సాగుకు చేసేందుకు ప్రతి సంవత్సరం రూ. 4,200 చొప్పున నాలుగు సంవత్సరాలు ఇస్తుందన్నారు. మొక్కలు నాటిన సంవత్సరం నుంచి ఎరువుల రాయితీకూడా నాలుగు సంవత్సరాలు ఉంటుందన్నారు. మండల పరిధిలో భూములు పామాయిల్ సాగుకు ఎంతో అనువుగా ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు 3ఎఫ్ ఏజీఎం రావి చంద్రబాబు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప ఇరుముడులు

పామర్రు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : హరిహర పుత్రుడు అయ్యప్పను దర్శించుకునేందుకు దీక్షాపరులు స్థానిక శివాలయంలో గురుస్వాములతో ఇరుముడులు కట్టించుకుని శబరిగిరికి పయనమయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణలతో శివాలయ ప్రాంగణం ఆదివారం మారుమోగింది. మాగంటి వెంకటరత్నం(నాని)గురుస్వామి తెలుగు యువత అధ్యక్షుడు కేదరాశిపల్లి శ్రీనివాసరావు ఇరుముడుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, దీక్షపరుల యాత్ర విజయవంతం కావాలంటూ వారి బంధువులు, స్నేహితులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కలకొండ ఆంజిబాబు, మధు, ఆరేపల్లి గోపి, అల్లంశెట్టి పవన్, కానోళ్ల దక్షణమూర్తి తదితరులు అన్నసమారాధాన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక శివాలయంలో పరమేశ్వరుడికి జరుగుతున్న ప్రత్యేకపూజల్లో ఎమ్మెల్యే వర్లకుమార్ ఆదివారం టీడీపీ నేతలతో కలసి పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకుడు లంక భీష్మ కుమార్‌రాజాకు స్వాగతం పలికారు. అనంతరం అయప్ప స్వాములకు పండ్లు అందజేసి శబరిగిరి యాత్ర దిగ్విజయం కావాలని ఆంక్షాస్తూ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వల్లూరిపల్లి గణేష్, మధు, ప్రసాద్, పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు అండగా టీడీపీ

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆదివారం జరిగిన కర్ణ భక్తుల సంక్షేమ సంఘం కార్తీక వనసమారాధన మహోత్సవాల్లో కూటమి నేతలతో కలసి ఎమ్మెల్యే, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత నూతనంగా ఎన్నికైన గుడివాడ పట్టణ కర్ణ భక్తుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కర్ణభక్తుల సంఘీయుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం తరపున సహకరిస్తానని తెలిపారు. అనంతరం నిర్వహించిన వనసమారాధనలో వనభోజనాలను ఎమ్మెల్యే రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు సంఘ పెద్దలతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్ణభక్తుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు తిప్పా మాణిక్యం, నిల్లా బసవ నాగన్న, అధ్యక్ష, కార్యదర్శులు పొన్నా దుర్గా మల్లేశ్వరరావు, తిప్పా కోటేష్, సంఘ పెద్దలు తుమ్మా మృత్యుంజయరావు, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, గుడివాడ జనసేన పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాస్, విఘ్నేశ్వరస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ సాయన రాజేష్, పలువురు కూటమి నాయకులు, వేలాది కర్ణ భక్తుల సంఘీయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



ర్యాలీ చేస్తున్న ధ్యాన కేంద్రం సభ్యులు

శాకాహారమే ఆరోగ్యం

కూచిపూడి, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మహాకరుణ శాఖాహార ర్యాలీ ఆదివారం సాయంత్రం కూచిపూడి, పెదపూడి గ్రామాల్లోని పలు పురవీధుల్లో నిర్వహించారు. శాఖాహారం అమృత ఆహారం, భౌతిక సంపద కంటే జ్ఞాన సంపదే మిన్న, అహింసా ధర్మం వర్ధిల్లాలంటూ నినాదాలు చేస్తూ సెంటర్‌లో ప్రదర్శన చేశారు. పిరమిడ్ కేంద్ర నిర్వాహకులు నాంచారయ్య, కోటచలం, పొన్నగంటి కోటేశ్వరరావు, తోట విజయలక్ష్మి, స్వర్ణలత, భ్రమ రాంబ పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన

గుడివాడ, నవంబరు17 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక పెద ఎరుకపాడు లోని శ్రీరామ లింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం భారీ వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 4వేల మంది వనసమారాధనలో పాల్గొన్నారు. ప్రతి ఏడాది ఇదే విధంగా స్థానిక గ్రామస్థుల మద్దతుతో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన అనువంశిక ధర్మకర్త దారపురెడ్డి చలపతిరావు తెలిపారు.

వెండిగిన్నె బహూకరణ

గుడ్లవల్లేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారికి భక్తుడు వెండిగిన్నెను బహూకరించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఏలూరుకు చెందిన బలభద్ర సర్వేశ్వర గుప్తా జ్ఞాపకార్థం వారి కుమారుడు బలభద్ర పవన్ కుమార్ అమ్మవారికి రూ. 11000ల విలువ చేసే 998 గ్రాముల వెండి గిన్నెను అమ్మవారికి కానుకగా ఆదివారం ఆలయంలో కొండలరావుకు అందజేశారు.

అయ్యప్ప పడిపూజ

పామర్రు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పామర్రు పట్టణంలోని గోపాలకృష్ణ రైస్‌మిల్లు ఆవరణలో అయప్పస్వామికి మహాపడిపూజను పరసా సందీప్ బ్రదర్స్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. మహాపూజను కేరళ తాంత్రికంతో మధు నంబూద్రిస్వామి క్రతువును చేశారు. అమలాపురానికి చెందిన రాజేష్ బృందం ఆలపించిన అయప్ప భజన సంకీర్తనలు ఆలరించాయి. ఈ కార్యక్రమంలో కలకొండ అంజిబాబు గురుస్వామి పామర్తి నాగరాజు గురుస్వామి, వీరంకి ఫణిస్వామి, గద్దె నాగశ్రీనివాస్, పడమట నాగరవితేజ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

ఘంటసాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని ఎస్సై పతాప్ రెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఘంటసాలశాఖా గ్రంథాలయంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. దిశా, పోక్సో చట్టం, ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, ఆపద సమయాల్లో పోలీసులను ఆశ్రయించటం అంశాలు వివరించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రంథాలయాధికారి ఎం.శరత్ కుమార్ ఎస్సైను సత్కరించారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు శివ నాగలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు.


నడకుదురు పృథ్వీశ్వర క్షేత్రం ఉసిరి వనంలో వనభోజనాలు


పృథ్వీశ్వర క్షేత్రం ఉసిరి చెట్టు వద్ద మహిళల పూజలు


పాండురంగస్వామి దేవాలయంలో దీపారాధనలు చేస్తున్న మహిళలు

ఐక్యతను చాటిన కార్తీక వనసమారాధనలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడో ఆదివారం కావడంతో మంగినపూడి బీచ్‌లో వేలాది మంది సముద్ర స్నానాలు ఆచరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిసముద్రంతో పాటు దత్తరామేశ్వరంలో ద్వాదశ బావుల వద్ద పుణ్యస్నానాలు చేశారు. బీచ్ సమీపంలోని ఉసిరిక వనాల్లో కార్తీక వన సమారాధనలు జరిగాయి. కార్తీక వనభోజనాలు ఐక్యతను చాటాయి. పాండురంగ స్వామిని ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అశ్వత్థ వృక్షం వద్ద దీపారాధనలు చేశారు. సహస్ర లింగ మండపంలో స్వామి వారికి అభిషేకాలు జరిపారు. ఆలయ నిర్వాహకులు టేకి నరసింహం కార్యక్రమాలను పర్యవేక్షించారు. రాధారంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు, జనసేన నాయకుడు బుల్లెట్ ధర్మారావు ఆధ్వర్యంలో మూడు వేల మందికి పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. చలమలశెట్టి జగన్, గొర్రెపాటి గోపీచంద్ అతిథులుగా పాల్గొన్నారు. లంకిశెట్టి నీరజ, విన్నకోట సంధ్య, వేముల కుమారి తదితరులు పాల్గొన్నారు. శివాలయాల్లో పరమశివునికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈవో సమ్మెట ఆంజనేయ స్వామి, శిరీష పర్యవేక్షించారు.


హంసలదీవి వద్ద సముద్ర స్నానం చేస్తున్న భక్తులు

హంసలదీవి బీచ్‌లో..

కోడూరు : హంసలదీవి బీచ్ వద్ద సముద్రపు అలలతో ఆటలు వద్దని, భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలని పాలకాయితిప్ప మెరైన్ సీఐ సురేష్ రెడ్డి అన్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం హంసలదీవి బీచ్ వద్దకు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాలతో భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. స్నానాలు ఆచరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మెరైన్ సిబ్బంది భక్తులకు వివరించారు.

భక్త జనసంద్రంగా నడకుదురు పృథ్వీశ్వర క్షేత్రం

చల్లపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా నడకుదురు శ్రీపృథ్వీశ్వరక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.


మోపిదేవి ఆలయంలో దీపారాధనలు చేస్తున్న భక్తులు


నాగ పడగను అందజేస్తున్న కల్యాణ్‌శేఖర్

సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో భక్తుల రద్దీ

మోపిదేవి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం, కార్తీకమాసం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామి వారి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం రూ.10,80,049 ఆదాయం వచ్చినట్లుఅధికారులు తెలిపారు.

వెండి నాగ పడగ సమర్పణ

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భద్రాద్రి జిల్లా కొత్తగూడెం గ్రామానికి చెందిన గుడిసెల కల్యాణ్ శేఖర్ వెండి నాగపడగను సమర్పించారు. రూ.92 వేలు విలువ గల కేజీ బరువు గల వెండి నాగ పడగను ఆలయ ఉద్యోగులకు ఆదివారం అందజేశారు. దాతలను శేష వస్త్రాలతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు.


పద్మశాలీయుల అన్నసమారాధన

పెడనలో వన సమారాధనలు

పెడన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీయ సంఘం ఆధ్వర్యం లో చిట్టూరి మాధవరావు తోటలో ఆదివారం కార్తీకవనసమారాధన నిర్వహించారు. వేదపండితుడు ఆకురాతి కృష్ణమోహన్ నేతృత్వంలో మహిళలు దామోదర వ్రతం చేశారు. అన్నసమారాధన నిర్వహించారు. పద్మశాలీయ సం ఘం నాయకులు నందం చినబాబు, నందం నాని, కొసనం సత్యనారాయణ, చిలుకోటి గోవిందు, అనుముల పెదపూర్ణ, పడవల నారాయణ, కేతన శ్రీను తదితరులు పాల్గొన్నారు. పవిత్ర కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని గంగా వన భోజనాలు చేసి సందడిగా గడిపారు. ఈవో యార్లగడ్డ వాసు, ఆలయ పెద్దల ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


పెడన మార్కెట్ యార్డులో..

పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అన్నసమారాధన జరిగింది. **పెడన రూరల్** : పెడన గృహనిర్మాణ వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో కార్తీక వనసమారాధన నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి వీణం శ్రీనివాస్ దంపతులు సత్యన్నారాయణ స్వామి వ్రతం, కార్తీక పూజ నిర్వహించారు. సంఘ సభ్యులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సంఘం అధ్యక్షుడు కటకం ప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మున్సిపల్ కమిషనర్ మన్నెం గోపాలరావు, గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి బి.వెంకటేష్‌లను సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు.



ఘనంగా రేపల్లె వారి ఆత్మీయ కలయిక

అవనిగడ్డ : పులిగడ్డ ఇరిగేషన్ గెస్ట్ హౌస్ లో రేపల్లె వారి ఆత్మీయ కలయిక, కార్తీక వనసమారాధన ఘనంగా జరిగాయి. రాష్ట్రం లోని ధనికుల గోత్రం రేపల్లె ఇంటి పేరు గల వకుటుంబసభ్యులు 1600 మంది పా ల్గొన్నా రు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు అలరించాయి.


జగన్నాథస్వామి ఆలయంలో హరినామ సంకీర్తన

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా బుట్టాయిపేట జగన్నాథస్వామి దేవాలయంలో ఆదివారం ఇస్కాన్ ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన జరిగింది. నందగోపాల్ దాస్ కృష్ణతత్వంపై ప్రసంగించారు. శ్రీకృష్ణుని స్తుతిస్తూ పాటలు పాడారు. కీర్తనలు గానం చేశారు. భజనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, కొట్టె వెంకట్రావు

కాపు కుటుంబీకుల కార్తీక వనసమారాధన 24న

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా ఈనెల 24వ తేదీన కాపు యువజన ఆధ్వర్యంలో చిలకలపూడి రైల్వేస్టేషన్ దగ్గరలోని కొండపల్లి సోమయ్య ఎస్టేట్స్‌లో కాపు కుటుంబీకుల ఆత్మీయ కార్తీక వనసమారాధన జరుగుతుందని మచిలీపట్నం జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తెలిపారు. భాస్కరపురం గాంధీబొమ్మ సెంటర్‌లో ఆహ్వాన పత్రికలను బండి రామకృష్ణ, జనసేన నాయకులు కొట్టె వెంకట్రావు, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తదితరులు ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు కుంచే నాని, పిప్పళ్ల కాంతారావు, జనసేన నాయకులు మాదివాడ రాము, సుంకర రాజశేఖర్, కూనపరెడ్డి ప్రసాద్, ఎం.పృథ్వీ రాజ్, కాపు యువజన సేన నాయకులు శాయన శివయ్య తదితరులు పాల్గొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే కార్యక్రమాల్లో కాపు, తూర్పుకాపు, తెలగ, ఒంటరి, బలిజ, మున్నూరు కాపులు కుటుంబ సమేతంగా రాజకీయాలకతీతంగా పాల్గొంటారన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ విచ్చేస్తారన్నారు. నియోజకవర్గంలో 20 వేల ఆహ్వాన పత్రికలు పంపిణీ చేస్తున్నామన్నారు.


పేద విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేస్తున్న మంత్రి రవీంద్ర

బెరాకా మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు బెరాకా మినిస్ట్రీస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులు 36 మందికి రూ.10.55 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు వితరణగా ఇచ్చారు. బెరాకా మినిస్ట్రీస్ ఉపాధ్యక్షుడు తిరుమాని వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు మేనేజర్ నాగిశెట్టి డానియేల్, కార్యనిర్వాహక సభ్యులు ఎస్.ఎస్.వి.ఎస్.వి. ప్రసాద్, కార్యవర్గ సభ్యు లు కాగిత రమాదేవి, టీడీపీ నాయకులు లోగిశెట్టి స్వామి, కొల్లూరి లలితరాజ్, చిన్నం శివ, అంజిబాబు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడిగా శేషుబాబు

అవనిగడ్డ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడిగా గుడివాక శేషుబాబు ఎన్నికయ్యారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు నేతృత్వంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఛైర్మన్‌గా శేషుబాబు, వైస్ ఛైర్మన్‌గా గరికపాటి హరిప్రసాద్, కార్యదర్శిగా అన్నపరెడ్డి వీరకుమారి, సంయుక్త కార్యదర్శి కోడూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా అల్లంశెట్టి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా మరో పది మందిని ఎంపిక చేశారు. జిల్లా రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ వంగర శేషగిరిరావు పర్యవేక్షించారు.

నంగేగడ్డలో ఎంవీకే విగ్రహావిష్కరణ రేపు



నాగాయలంక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దివిసీమ గాంధీ, మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు (ఎంవీకే) విగ్రహావిష్కరణ ఈనెల 19న నంగేగడ్డలో జరుగుతుందని మాజీ సర్పంచ్ బావిరెడ్డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యేలు కోట్ల సూర్య ప్రకాశరెడ్డి, కొణతల రామకృష్ణ, మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొంటారని ఆయన తెలిపారు.

పల్లాను కలిసిన తెలుగు యువత నేత



నాగాయలంక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్‌ని నాగాయలంక తెలుగు యువత అధ్యక్షుడు మేడికొండ విజయ్ ఆదివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆర్థిక సాయం

నాగాయలంక, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మెరకగౌడపాలెం గ్రామానికి చెందిన చాట్రగడ్డ జానకి రామయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ చని పోయాడు. మండల ఎస్సీఎస్టీ కమిటీ ఆధ్వర్యంలో రూ.5 వేలను మృతుని భార్యకి ఆదివారం సంఘం నేతలు అందించారు. మంచాల తిరుపతి వరప్రసాద్, కందుల శంకర్, తానంకి పోతురాజు, దాసరి శేఖర్ బాబు, కైతేపల్లి రాజేంద్ర ప్రసాద్, మాతంగి మనోహ రాజ్, గుంటూరు సురేష్, విజయ్, సూరిబాబు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

చల్లపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్రవైద్య శిబిరం జరిగింది. వైద్యశిబిరంలో డాక్టర్ మోహనరావు 40 మందిని పరీక్షించి 18 మందిని ఐవోఎల్ శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఈనెల 20వ తేదీ బుధవారం విజయవాడ అమరావతి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి, ఉరిమి రమేష్ కుమార్, దింటకుర్తి జ్యోతి తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించి సేవలందించారు.

నామినేటెడ్ పదవి ఇవ్వాలని పవన్‌కు వినతి

పెడన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తనకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరుతూ మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు నల్లమోతు రఘురామ్ జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కలసి దరఖాస్తు సమర్పించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించానన్నారు. పెడన నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, సార్వత్రిక ఎన్నికలలో కాగిత కృష్ణప్రసాద్, వల్లభనేని బాలశౌరి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. తన సేవలను గుర్తించి పెడన మార్కెట్ యార్డు చైర్మన్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్, ఏపీఐఐసీ డైరెక్టర్, టూరిజం బోర్డు డైరెక్టర్ వాటిల్లో ఏదో ఒకటి ఇవ్వాలని కోరారు.



భగవద్గీత పోటీల్లో పాల్గొనండి

మచిలీపట్నం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబరు 5,6 తేదీల్లో మహతి కళావేదిక వద్ద నిర్వహిస్తున్న భగవద్గీత పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని ప్రోగ్రాం అసిస్టెంట్ సి.వి.కె. ప్రసాద్ తెలిపారు. మనగుడి కార్యక్రమం కింద కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి దేవాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక ఉపన్యాసాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం ముగిసాయి. మండలిక శ్రీకృష్ణకుమార్ కార్తీక పౌర్ణమిపై ప్రసంగించారు. దేవరకోట అభయాంజనేయ భక్తసమాజం భజన చేసింది. ఈవో శిరీష, శ్రీవారి సేవకులు తురగా ప్రసాద్, కె. శ్రీకాంత్ పాల్గొన్నారు. 6వ తేదీ ఉదయం 9 నుంచి విద్యార్థులకు ఆత్మసంయమన యోగంపై పోటీలు నిర్వహిస్తారన్నారు.

ఐదెకరాల వరిగడ్డి వామి దగ్ధం

ఘంటసాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గోగినేనిపాలెం గ్రామానికి చెందిన కుంపటి చక్రవర్తికి చెందిన ఐదు ఎకరాల వరి గడ్డివామికి ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. స్థానికులు గమనించి వెంటనే అవనిగడ్డ అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వటంతో వచ్చి మంటలను అదుపు చేశారు.

బొమ్మిడి నాయకర్ పుట్టిన రోజు వేడుకలు

అవనిగడ్డ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అగ్నికుల క్షత్రియ నేత బొమ్మిడి నాయకర్ పుట్టిన రోజు వేడుకలను అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. అగ్నికుల క్షత్రియుల సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆయనకు ప్రభుత్వ విప్‌గా అవకాశం కల్పించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేక్‌కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ సభ్యులు ఒడుగు నాగార్జున, కోలా వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ నాంచారయ్య, నాగిడి అమలేశ్వరరావు, సైకం వాసం, నడకుదుటి వీర వెంకట్రావు, నాగిడి శ్రీనివాస్, నాగిడి వెంకట నారాయణ, సైకం నాని తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో కవి సమ్మేళనం

అవనిగడ్డ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో బాగంగా అవనిగడ్డ బ్రాంచి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన, కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ చిత్రకారుడు పావులూరి చిదంబరేశ్వరరావు చిత్రించిన పలు చిత్రాలను ప్రదర్శించారు. వర్ధమాన కవు లు కె.శివరావు, నాగ శంకర రావు, సింహాద్రి పద్మ, దివియాన్సీ, తోట గణేష్, జి.సూర్యనారాయణ, కాదాంబరేశ్వరరావు, సింహాద్రి రామలింగేశ్వరరావు, ఏ.వీరకుమారిలు తమ కవి సమ్మేళనంలో తమ కవితలు వినిపించి అనంతరం పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అధికారి ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఘంటసాల : శ్రీకాకుళం శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం కార్యక్రమాన్ని గోగినేనిపాలెం హెచ్ ఎం తమ్మన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారిణి దారా సుజాత ఏర్పాట్లు పర్యవేక్షించగా, అంగన్‌వాడీ టీచర్ కనకదుర్గ, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.